# సగటు జీవి

బి.వి.ఎస్. ప్రసాద్

మొదటి కథ

మా ఆవిడ వూరెళ్లి తిరిగి వస్తోందంటే భయం... దడ...

“అదేంటి? ఇక్కడ వుండాల్సినవి ఏవీ?... ఇదేంటి? ఇవి ఇక్కడికి ఎందుకొచ్చాయి?... పనిమనిషి వచ్చిందా? ఇల్లు చిమ్మిందా?... నా నీలం రంగు చీర కనపడట్లేదు... దానికేమైనా ఇచ్చారా?” ప్రశ్నలూ... విరుపులూ...

ప్రతి ఇంట్లోలాగే – నాకూనూ!

* * *



మా ఆవిడ పేరు సామ్రాజ్యం. పేరు పాతదే అయినా, 'సామీ' అని ముద్దుగా పిలుచుకొంటాను. నేను 'సామీ!' అని అర్థిస్తున్నట్లు అనడమూ, అదేమో 'ఏమీ!' అని గద్దించడం అలవాటైపోయింది పదేళ్లలో. సామీ గద్దిస్తుందనే గానీ... మంచిదే. ఆ మాత్రం గద్దించకపోతే కంట్రోల్లో వుంటామటండీ మగవాళ్లం? సామీకి నేనంటే ప్రేమ. పెళ్లయి ఇన్నేళ్లయినా నా కోసం ఎదురుచూస్తుంటుంది హుషారుగా. ఇంటికి తెచ్చిన ఆఫీసు ఫైళ్లు తిరగేస్తూంటే ముద్దలు కలిపి నోట్లోపెడుతుంది. మల్లెపూలు తెచ్చినపుడు తలవంచి, కళ్లుమూలకు చేర్చి, పెదాలు నొక్కి పట్టి నవ్వు చిందిస్తుంది. అబ్బ! ఆ చూపులో ఎంత ప్రేమో!

ఇంటి పనులన్నీ తనే చేసుకొంటుంది. ఇంటిపని, వంటపని, పిల్లల్ని రెడీచేయడం. బజార్లు, షాపింగ్‌లూ అన్నీ. ఆఫీస్ పనులతో మీరు సతమతమవుతుంటారు – నే చేసుకొంటాన్లే అంటుంది పిచ్చిది. అలసిపోతుంది కదా! రాత్రి పడుకొనే ముందు 'కాళ్లుపడతానే' అంటే 'ఛీ! వద్దండీ' అంటూ చీరతో కప్పేస్తూ కాళ్లు

వెనక్కి లాక్కొంటుంది. ఆ సీన్‌లో సామ్రాజ్యం భలే నచ్చుతుంది.

ఆలనా - పాలనా - పరిపాలనా అన్నీ 'నా సామ్రాజ్యమే' అంటుంది.

చివరికి పడకగదిలో కూడా తన మాటే నెగ్గాలంటుంది.

* * *

ఇంత ప్రేమైతే వుంది కానీ... నాలుగురోజుల కోసం హైదరాబాద్‌కి వెళ్లి వస్తోందంటే దడగా వుంది... దడకు కారణం... పూలమొక్కలు ఎండిపోయాయి...

'మొక్కలకు రోజూ నీళ్లు పోయండి' అని గట్టిగా చెప్పి మరీ వెళ్లింది. 'చెవులు మెలేసినట్లు చెప్పకే - విన్నాన్లే' అన్నానేగానీ - ఏదీ... గత మూడు రోజుల్నుంచీ నీళ్లుపోయలేదు.

మొదటి రోజు పోశానుగానీ, పక్కరోజు సెకండ్‌షోకి వెళ్లి లేటుగా లేచి నీళ్లుపట్టాక, న్యూస్‌పేపర్ చదువుతూ మర్చిపోయా! చదివింది ఒకటికాదు, రెండుకాదు... ఏకంగా మూడు పేపర్లు! 'సత్యం' కంపెనీ కూలిపోతోందన్న వైనం సవివరంగా, రీసెర్చ్‌స్కాలర్‌కి మల్లే మూణ్ణాళ్లూ తిరగేసా! ఫలితం!- మొక్కలకు నీళ్లు దక్కలేదు.

'సత్యం' అథోపతనం మొక్కలకూ - నాకూ చిక్కే తెచ్చింది.

* * *

ట్రింగ్... ట్రింగ్... ఫోన్ మోగింది.

'ఆ! సామీ... చెప్పు'

'నేను స్టేషన్‌లోదిగి సర్వీస్ ఆటోలో వచ్చేస్తా! కారుతేకండి - పెట్రోలు వేస్టు!'

"సరే - అలాగేనే"

ఆదరాబాదరాగా ఇల్లంతా సర్దాను... ముఖ్యంగా టీవీ, టీపాయ్, ఫ్రిజ్, పేపర్లూ, డోర్ కర్టెన్లూ, చెప్పుల స్టాండూ అన్నీనూ.

* * *

పూలమొక్కలంటే సామీకి ప్రాణం! రోజూ తోటలో పనిచేస్తుంది.

ఏమంటుందో! ఏమో!! ఏమౌతుందో! ఏమో!!

* * *

బయట ఆటోచప్పుడుకి ఉలిక్కిపడ్డా. డబ్బులిచ్చి ఆటో దిగింది. బ్యాగులు చేతికందించింది. ఇంట్లోకి వస్తూ, వెనకనే వస్తున్న సామ్రాజ్యం వాడిన చెట్లను గమనిస్తోందని గమనిస్తున్నా. చెట్లను తాకుతోంది పలకరింపుగా!

అయిపోయాన్రా - పడతాయిరా తిట్లు - రెడీ అయిపోయా... కానీ, ఇంతలోనే అవాక్కయ్యా...

చేతికి తగిలించుకొన్న హేండ్‌బాగ్ గిరాటేసి - రెండు చేతులూ చాచి - వాకిలి తలుపులు తీసివున్నాయని కూడా గమనించకుండా - నన్ను అమాంతంగా గట్టిగా కౌగిలించుకొని ముద్దుల్తో ముంచేసింది!

తడబడుతూ - 'ఏమిటి?' అన్నా!

'ఎంత తెలివైనవారండీ మీరు - షేర్‌మార్కెట్ కూలుతోందని - పోయిన్నెల్లో సత్యం షేర్లు అమ్మి గాజులు చేయించారు' అంది కళ్లను మెరిపిస్తూ, తృప్తిగా!!

గత నెలలో నష్టానికే అమ్మినా - నష్టంలో కూడా ఆనందం వెతుక్కోవడమే మిడిల్‌క్లాస్ జీవితం కదా!! ●